క్లుప్తంగా...

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న బైతి శ్రీధర్

శంషాబాద్: పట్టణంలోని 11వ వార్డు తొండుపల్లిలోని పేద కుటుంబంలో జరుగుతున్న పెళ్లికి బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీటీసీ బైతి శ్రీధర్ ఆర్థిక సాయాన్ని అందజేశారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న సుభాష్ కుమార్తె వివాహానికి రూ. 21 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీజేవైఎం రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్, శ్రీకాంత్, హరీష్,రాకేష్, రాజ్, రామకృష్ణ, నీరజ్, బైతి సిద్ధు పాల్గొన్నారు.

'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమం నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటల నుంచి 8 గంటల వరకు జరుగుతుంది. ఈ సందర్భంగా 'ది బెస్ట్ ఈజ్ యెట్ టు కమ్' అనే అంశంపై సేథ్ మెడికల్ ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ యజమాని, ప్రొఫెషనల్ పీడియాట్రిషియన్ డాక్టర్ వాలెంటీనా సేథ్ ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ నంబర్ 040–23001234లో సంప్రదించాలి.

నేటినుంచి బౌల్డర్‌హిల్స్‌లో ఆటోక్రాస్ చాంపియన్‌షిప్

- ఆపరేషన్ థియేటర్ కోసం నిధుల సేకరణ

రాయదుర్గం: పుట్టుకతో గుండె జబ్బులున్న పిల్లలకు సాయం చేయడానికి ఆపరేషన్ థియేటర్ ఏర్పాటుకు నిధుల సేకరణకు ఆటోక్రాస్ చాంపియన్‌షిప్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. రోటరీ క్లబ్ ఆఫ్ లేక్ డిస్ట్రిక్ట్ మొయినాబాద్ తొలిసారిగా ఇండియన్ నేషనల్ ఆటోక్రాస్ చాంపియన్‌షిప్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసింది. గచ్చిబౌలిలోని బౌల్డర్‌హిల్స్ గోల్ఫ్ కోర్సులోని కస్టమ్-బిల్ట్ రేస్ ట్రాక్‌లో శుక్ర, శని, ఆదివారాల్లో ఈ చాంపియన్‌షిప్ నిర్వహిస్తారు. సిద్ధిపేటలోని స త్యసాయి ఆస్పత్రిలో గుండె ఆపరేషన్ల నిర్వహణ కు రూ.7.5 కోట్ల వ్యయం అవుతుందని మోటార్ స్పోర్ట్స్ క్లబ్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు అనుపమ్‌రాజ్, విష్ణు ఉపాధ్యాయ వివరించారు. ఔత్సాహిక పోటీదారులు తమ సాధారణ కార్లతో కూడా ఈ పోటీలో పాల్గొనవచ్చని వారు స్పష్టం చేశారు.

బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేయాలి

గౌలిపురా: బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో ఎవరికీ ఇప్పటి వరకు రుణాలు మంజూరు కాలేదని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమేశ్ గురుస్వామి అన్నారు. రుణాల కోసం 5.60 లక్షల మంది దరఖాస్తులు చేసుకోగా ఇప్పటి వరకు రుణాలు మంజూరు చేయలేదన్నారు. జనాభాలో 55 శాతం ఉన్న బీసీల పట్ల ప్రభుత్వం వివక్ష చూపతుందన్నారు. ఎస్సీ, ఎస్టీలకు దళిత బంధువు కింద రూ.10 లక్షలు ప్రకటించిన ప్రభుత్వం బీసీలకు కూడా రూ.10 లక్షల సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలన్నారు. ఇటీవల బీసీ కులవృత్తుల వారికి ప్రకటించిన రూ.లక్ష దేనికి సరిపోవన్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా గత ఎనిమిదేళ్లుగా సబ్సిడీ రుణాలు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. దరఖాస్తులను పరిశీలించి అర్హులకు రుణాలు మంజూరు చేయాలని కోరారు.

ఉత్సవాల సమయంలో సంయమనం పాటించాలి

గోల్కొండ: స్థానికంగా జరిగే ఉత్సవాలు, పండుగలు పతాకావిష్కరణ వేడుకల సందర్భంగా ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలని గోల్కొండ ఇన్‌స్పెక్టర్ ఎస్. వెంకటేశ్వర్లు అన్నారు. గోల్కొండ కోటలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా గురువారం ఆయన గోల్కొండ పోలీస్ స్టేషన్‌లో మైత్రి కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. సందర్భంగా మాట్లాడుతూ... గోల్కొండ కోట విభిన్న వర్గాల ప్రజలకు నిలయమని ఒకరిని ఒకరు గౌరవించుకుంటూ ఇరువర్గాల వారు పండుగలు, వేడుకల్లో పాల్గొనాలన్నారు. కోటలో జరిగే పతాకావిష్కరణ వేడుకల్లో సైతం మైత్రి కమిటీ సభ్యులు తమవంతు సహాయ సాకారాలు అందించాలని కోరారు.పీస్ రాజువస్తాద్, ఆబెద్, అక్బర్, షానవాజ్ ఖాన్, ఎం.ఎ,బేగ్, మీర్జా ఎక్బాల్ అహ్మద్, జంగయ్య పాల్గొన్నారు.

ఉద్యమకారులకు ప్రాధాన్యం ఇవ్వాలి

చార్మినార్: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల సందర్భంగా జూన్ 2న నిర్వహించనున్న కార్యక్రమాల్లో రా ష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి గౌరవించాలని తెలంగాణ ఉద్యమకారుడు గడ్డమీది హరినాథ్ గౌడ్ అన్నారు. రాష్ట్ర సాధన ఉద్యమంలో ఎందరో అమరులయ్యారని, ఎంతో మందిపై అక్రమ కేసులు నమోదయ్యాయన్నారు. ఉద్యమకారులను గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. తెలంగాణ ఉద్యమంలో అమరులైన కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు.

భారీగా గంజాయి పట్టివేత

- 228 కిలోల గంజాయి స్వాధీనం
- కొబ్బరి బొండాల చాటున అక్రమ రవాణా
- ఇద్దరు నిందితుల అరెస్ట్
- ప్రధాన నిందితుడి కోసం గాలింపు



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి





నిందితులు ఆదీల్, షరీఫ్ ఖాన్

రాజేంద్రనగర్: కొబ్బరి బొండాల చాటున అక్రమంగా రవాణా చేస్తున్న గంజాయిని రాజేంద్రనగర్ ఎస్ఓటీ పోలీసులు, శంకర్‌పల్లి పోలీసులు పట్టుకున్నారు. ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ. 54 లక్షల విలువైన 228 కిలోల గంజాయి, బొలేరో వాహనం, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడి కోసం గాలిస్తున్నట్లు రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రకు చెందిన సమీర్ ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయి కొనుగోలు చేసి వివిధ మార్గాల గుండా మహారాష్ట్రకు తరలించేవాడు. అతడిపై ఏపీ, తెలంగాణ, మహారాష్ట్రలో పలు కేసులు ఉన్నాయి. అతడిపై పోలీసు నిఘా తీవ్రం కావడంతో గత కొన్ని నెలలుగా మధ్యవర్తులను ఏర్పాటు చేసుకుని వారి ద్వారా గంజాయి దందా కొనసాగిస్తున్నాడు. ఇందుకుగాను ఒకసారి ఉపయోగించిన వ్యక్తులను మరోసారి ఉపయోగించకుండా అక్రమ రవాణా కొనసాగిస్తున్నాడు. బుధవారం రాజమండ్రి నుంచి బొలేరో వాహనంలో పెద్ద ఎత్తున గంజాయి తరలిస్తున్నట్లు రాజేంద్రనగర్ ఎస్ఓటీ పోలీసులకు సమాచారం అందడంతో ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో నిఘా ఏర్పాటు చేశారు. ఔటర్‌తో పాటు మోకిల, శంకర్‌పల్లి ప్రాంతాల్లో కాపు కాశారు. గురువారం ఉదయం కొబ్బరి బొండాల లోడ్‌తో వస్తున్న బొలేరో వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా కొబ్బరిబొండాల మధ్యలో రెండు కిలోల చొప్పున ప్యాక్ చేసిన 114 గంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాయి. వీటిని నిందితులు కొబ్బరిబొండాల గుత్తిలో కనిపించని విధంగా ప్యాక్ చేయడం గమనార్హం. దీంతో పోలీసులు మహారాష్ట్ర అమరావతికి చెందిన సయ్యద్ ఖాన్ షరీఫ్ ఖాన్, అకోలా ప్రాంతానికి చెందిన మహ్మద్ ఆదీల్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి మూడు సెల్‌ఫోన్లు, బొలేరో వాహనం, 228 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు సమీర్ రాజమండ్రి నుంచి మహారాష్ట్రకు వాహనాన్ని తీసుకువచ్చి ఇస్తే రూ.25 వేలు ఇస్తానని చెప్పినట్లు నిందితులు వెల్లడించారు. గంజాయిని స్వాధీనం చేసుకున్న ఎస్ఓటీ పోలీసులను డీసీపీ అభినందించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్, కార్పొరేటర్ అర్చన జయప్రకాష్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నామని, ఇందులో భాగంగా రూ. కోట్ల విలువైన అభివృద్ధి పనులను చేపడుతున్నామని ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. గురువారం రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలోని శివరాంపల్లి, బుద్వేల్, రాజేంద్రనగర్ పత్తికుంట ప్రాంతాల్లో కార్పొరేటర్ అర్చన జయప్రకాష్‌తో కలిసి రూ. 3.97 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నామన్నారు. బస్తీలు, కాలనీల అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తున్నామన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు నాయకులు కాలనీల్లో పర్యటించాలని, తాము గుర్తించిన సమస్యలను తన దృష్టికి తీసుకురావాలన్నారు. వాటిపై ప్రత్యేక సమీక్ష నిర్వహించి అధికారులతో చర్చించి నిధులను మంజూరు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు పోరెడ్డి ధర్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి పలుగుచెరువు మహేష్, రగడంపల్లి శ్రావణ్, సాయిమాలిక్, అక్కిరాజు రాధేశ్యాం, పడమటి శ్రీధర్, యాదయ్యయాదవ్, సాయిగౌడ్, ప్రభాకర్ రెడ్డి, రఘు ముదిరాజ్, కొమురయ్య, వై.శ్రీధర్, జోగి రవి తదితరులు పాల్గొన్నారు.

అత్యున్నత స్థాయికి చేరాలి



ఫలితాలను విడుదల చేస్తున్న దృశ్యం

మణికొండ: ఉత్తమ ప్లేస్‌మెంటే లక్ష్యంగా ఇంజినీరింగ్, ఎంబీఏ విద్యార్థినులు రాణించాలని సర్వీస్ నౌ సీనియర్ ప్రోగ్రామ్ మేనేజర్ అనూప్ కేదారి శెట్టి అన్నారు. వట్టినాగులపల్లి శివారులోని శ్రీదేవి మహిళా ఇంజినీరింగ్ అటానమస్ కళాశాలలో గురువారం 2022–23 మొదటి సంవత్సరం బీటెక్, ఎంబీఏ విద్యార్థిను మొదటి సెమిస్టర్ ఫలితాలను గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి 75 శాతం మార్కులతో పాటు అత్యుత్తమంగా ఉన్న క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లే లక్ష్యంగా రాణించాలన్నారు. అన్ని రకాల నైపుణ్యాలు ఉన్న విద్యార్థులను సంస్థలు ఉద్యోగులుగా ఎంపిక చేసుకుంటున్నాయన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన మొదటి సంవత్సరం విద్యార్థినులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కళాశాలలో కొత్తగా చేర్చిన సీఎస్ఈ(డేటాసైన్స్), సీఎస్ఈ (ఎఐ/ఎంఎల్) కోర్సుల్లో బీటెక్ విద్యార్థినులు రాణించారని ప్రిన్సిపాల్ డాక్టర్ బిఎల్. మల్లీశ్వరి అన్నారు. ప్రతి శాఖ నుంచి టాపర్‌లను ముఖ్య అతిథికి పరిచయం చేశారు. ఈ సందర్భంగా మొదటి సంవత్సరం విద్యార్థినుల ఆల్ రౌండ్ ప్రతిభ కనబర్చినందుకు కళాశాల వైస్ చైర్మెన్ డాక్టర్ కె. రాధాకిషన్‌రావు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ డాక్టర్ వై. కృష్ణారెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి కె. తులసీరాంలతో పాటు అన్ని విభాగాల హెచ్ఓడీలు, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

విద్య, వైద్యానికి ప్రాధాన్యం

- ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ
- ఎంఐజీ కాలనీలో బస్తీ దవాఖానా ప్రారంభం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ, చిత్రంలో జిల్లా వైద్యాధికారులు

శేరిలింగంపల్లి: పేద, మధ్య తరగతి ప్రజలకు వైద్య సేవలు అందుబాటులో ఉండేలా బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేస్తున్నామని ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ పేర్కొన్నారు. శేరిలింగంపల్లి పరిధిలోని ఎంఐజీ కాలనీలో నూతనంగా బస్తీ దవాఖానాను ఆయన జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సృజన, కార్పొరేటర్ సింధూఆదర్శ రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్య,వైద్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు మోహన్‌గౌడ్, నాగమణి, ఆదర్శ్‌రెడ్డి, భాస్కర్‌ముదిరాజ్, తీలావత్, చిన్న, వెంకట్‌రావు, వెంకట్‌రెడ్డి, రాకేష్, రాణి, జ్యోతి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

సెల్లార్‌ల తవ్వకానికి అడ్డుకట్ట వేయండి



సన్‌సిటీ ప్రాంతంలో అక్రమంగా సెల్లార్ గోతులను తవ్వుతున్న దృశ్యం



కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ సాగర్‌గౌడ్

బండ్లగూడ: అనుమతులు లేకుండా అక్రమంగా సెల్లార్ గోతులను తవ్వుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ 20వ డివిజన్ కార్పొరేటర్ సాగర్‌గౌడ్ అన్నారు. ఈ మేరకు గురువారం కార్పొరేషన్ కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి సన్‌సిటీ ప్రాంతంలోని మావా మెడికల్ హాల్ ప్రాంతంలో అనుమతులు లేకుండా అక్రమంగా సెల్లార్ గోతులను తవ్వుతున్నారన్నారు. ఈ హైవేలో రోడ్డు వెడల్పు పనులు చేపట్టాల్సి ఉందన్నారు. 100 ఫీట్ల రోడ్డు కోసం ఇప్పటికే ప్రతిపాదనలు పంపారన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను వినతిపత్రం ద్వారా కోరామన్నారు. ఆయన సానుకూలంగా స్పందించారని తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

బిగ్‌బాస్కెట్ డెలివరీ బాయ్ ఆత్మహత్య

గచ్చిబౌలి: కిరాణ సరుకులు చేరవేసే బిగ్ బాస్కెట్ డెలివరీ బాయ్ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ సురేష్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఒడిషాకు చెందిన ఎల్.హరీష్(26) మూసాపేట్‌లో నివాసం ఉంటూ మూడేళ్లుగా బిగ్ బాస్కెట్‌లో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. బుధవారం ఉదయం 6 గంటలకు సరుకులు డెలివరీ చేసేందుకు సహ ఉద్యోగి రాజేష్‌తో కలిసి మసీద్‌బండలోని సీఎంసీ ఎన్‌క్లేవ్‌లోని ఆర్‌వీ పంచజన్య అపార్ట్‌మెంట్‌లోని వివిధ ఫ్లాట్లకు వెళ్లారు. సరుకులు డెలివరీ చేసిన అనంతరం రాజేష్ రాలేదు. అక్కడి సెక్యూరిటీకి సమాచారం అందించగా బీ–1లో ఫైర్ సేఫ్టీ పైపులకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించడంతో మృతదేహానికి ఉస్మానియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కాగా మూడున్నర లక్షలు అప్పుగా తీసుకున్న వ్యక్తి తిరిగి ఇవ్వకపోవడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది.

చిరు వ్యాపారులకు చేయూత



నార్సింగిలో చిరువ్యాపారులకు గొడుగులు అందించిన వైస్ చైర్మన్ వెంకటేశ్‌యాదవ్

మణికొండ: రోడ్లపై చిరువ్యాపారాలు చేసుకుంటున్న వారికి తమ వంతు సాయంగా గొడుగులు అందజేయడం అభినందనీయమని నార్సింగి మున్సిపల్ వైస్ చైర్మన్ జి.వెంకటేశ్‌యాదవ్ అన్నారు. గురువారం చేవెళ్ల ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి పంపిన గొడులను ఆయన నార్సింగి, గండిపేటలోని చిరువ్యాపారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు బీఆర్ఎస్ నేతలు అండగా నిలుస్తున్నారన్నారు. మండుటెండలో చిరు వ్యాపారాలు చేసుకునే వారికి ఉపశమనం కలిగించేందుకు నీడనిచ్చే గొడుగులను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు ప్రశాంత్‌యాదవ్, నాయకుడు గోపాల గణేష్‌లతో పాటు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, వ్యాపారులు పాల్గొన్నారు.

దశలవారీగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి



శేరిలింగంపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో తరగతి గదులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్, ఎంఈఓ వెంకటయ్య

శేరిలింగంపల్లి: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం 'మనబస్తీ–మన బడి' కార్యక్రమాన్ని చేపట్టిందని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. గురువారం శేరిలింగంపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.78 లక్షలతో చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణానికి మండల విద్యాధికారి వెంకటయ్య, కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో దశలవారీగా అదనపు తరగతి గదుల నిర్మాణం చేయడం జరుగుతుందన్నారు. తరగతి గదులు, క్లాస్‌రూమ్‌లో డ్యూయల్ డెస్కులు, టాయిలెట్లు, మంచినీటి సౌకర్యం, వంటగదులు, భోజనశాల ప్రహరీగోడలు వంటి సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడమే సీఎం కేసీఆర్ లక్ష్యమన్నారు. శేరిలింగంపల్లి మండలంలో 24 పాఠశాలలు, కూకట్‌పల్లి మండలంలో 7 పాఠశాలల్లో మొదటి విడత ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీఎస్‌ఈడబ్ల్యూడీసీ ఏఈ శ్యామ్, నాయకులు హబీబ్, మహ్మద్ అహ్మద్, గోపాల్‌యాదవ్, రవి యాదవ్ లక్ష్మణ్‌యాదవ్, రవి, శ్రీనివాస్,సాయి, ఉపాధ్యాయులు శంకర్, బలరామ్, బల్వంత్‌రెడ్డి, కరుణ పాల్గొన్నారు.

మాదాపూర్ ఓల్డ్ విలేజ్‌లో..

మాదాపూర్: కొండాపూర్ డివిజన్ మాదాపూర్ ఓల్డ్ విలేజ్‌లోని ప్రభుత్వ పాఠశాలలో అదనపు గదుల నిర్మాణానికి ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ హమీద్‌పటేల్‌తో కలసి ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ నీలం రవీందర్ ముదిరాజ్ పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ ఆధ్వర్యంలో అమరవీరులకు నివాళి



మాట్లాడుతున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జ్ఞానేశ్వర్‌ముదిరాజ్

బండ్లగూడ: తెలంగాణ రాష్ట్రం అమరవీరులు ప్రాణత్యాగాలతో ఏర్పడిందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అమరవీరులకు ఘనంగా నివాళులు అర్పించేందుకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. గురువారం బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎంతో మంది అమరవీరులు తమ ప్రాణాలను త్యాగం చేశారన్నారు. వారి కుటుంబాలకు ఓదార్పునిస్తూ అమరవీరులను స్మరించేందుకు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఉదయం 10 గంటలకు అమరవీరుల స్థూపం వద్ద నివాళి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నారాయణ ప్రమాణస్వీకారానికి తరలిన బీఆర్ఎస్ నేతలు



సన్మాన సభకు తరలివెళ్తున్న నాయకులు



పులిమామిడి నారాయణను సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బండ్లగూడ: తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ పులిమామిడి నారాయణ ప్రమాణ స్వీకారానికి బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ నాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. గురువారం ఉదయం సన్‌సిటీ నుంచి కార్మిక విభాగం రాష్ట్ర కార్యదర్శి రాముడు యాదవ్ ఆధ్వర్యంలో నగరంలోని లేబర్ ఆఫీస్‌కు ర్యాలీగా తరలి వెళ్లారు. ప్రమాణ స్వీకారం అనంతరం ఆర్టీసీ క్రాస్ రోడ్డు నుంచి బాగ్‌లింగంపల్లిలోని ఆర్‌టీసీ కల్యాణ మండపంలో నిర్వహించిన బహిరంగ సభలో ఎంపీ రంజిత్‌రెడ్డి సమక్షంలో నారాయణను కలిసి సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ లక్ష్మిభాయి, సంఘ సేవకులు యానమల రాజు, సీనియర్ నాయకులు వెంకటేష్, బాలకృష్ణ, మైనార్టీ నాయకులు ఆసిఫ్, మోసిన్‌ఖాన్, చందు, బాలకృష్ణారెడ్డి, కుమార్, రమణ, స్వామి, రత్నం, మాణిక్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆకట్టుకుంటున్న ఫార్మాలిటిక



మందుల తయారీ, ప్యాకింగ్‌పై సందర్శకులకు అవగాహన కల్పిస్తున్న నిర్వాహకులు

మాదాపూర్: మాదాపూర్‌లోని హైటెక్స్‌లో ఏర్పాటు చేసిన ఫార్మాలిటిక- 2023 నగరవాసులను విశేషంగా ఆకట్టుకుంటోంది. మూడురోజుల పాటు నిర్వహించనున్న ఈ ప్రదర్శనలో 150కి పైగా కంపెనీలు 300లకు పైగా టాప్‌లైన్ బ్రాండ్‌లను ప్రదర్శనలో ఉంచారు. ఈ ఎక్స్‌పోలో నగర నలుమూలల నుంచి మెడికల్ నిర్వాహకులు, డాక్టర్లు వచ్చి సందర్శించి అధునాతన ఉత్పత్తుల గురించి స్టాల్స్‌లో తెలుసుకుంటున్నారు.

- ఇన్‌ఫార్మా మార్కెట్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ యోగేష్‌ముద్రాస్ మాట్లాడుతూ పూర్తిస్థాయి ఫార్మాస్యూటికల్ ఎకో సిస్టమ్, పరిశ్రమ వాటాదారులను ఒకచోటకు చేరుస్తుందన్నారు.
- ప్రదర్శనలో మందుల తయారీ విధానం, ప్యాకింగ్, రవాణా విధానం తదితర అంశాలపై సందర్శకులకు స్టాల్స్ నిర్వాహకులు వివరిస్తున్నారు.
- ఉదయం 10గంటల నుండి రాత్రి 8 గంటల వరకు ప్రదర్శన సందర్శకులకు అందుబాటులో ఉంటుంది.

వివాహ వేడుక



వధూవరులను ఆశీర్వదిస్తున్న హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ తదితరులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్‌యాదవ్ కుమార్తె భవానీ వివాహం నందు భార్గవ్‌తో గురువారం ఘనంగా జరిగింది. శంషాబాద్‌లోని మల్లికా కన్వెన్షన్ హాల్‌లో జరిగిన వేడుకకు హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, మాజీ బీసీ కమిషనర్ సభ్యులు ఆచారి, విశ్వేశ్వర్‌రెడ్డి, కామ రంగారెడ్డి, డాక్టర్ ప్రేమ్‌రాజ్, వై.శ్రీధర్, మొంద్ర కొమురయ్య, మల్లారెడ్డి, కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, సంగీత, బొక్క బాల్‌రెడ్డి, రార్తూరి రాజశేఖర్, సులిగే వెంకటేష్, విజయ్, అడికే జనార్దన్, బాబురావు తదితరులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

నేడు చార్మినార్ వద్ద దశాబ్ది వేడుకలు

చార్మినార్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం ఉదయం చారిత్రక చార్మినార్ వద్ద జాతర జాతీయ పతాకావిష్కరణ చేసి సంబరాలు నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ పార్టీ చార్మినార్ నియోజకవర్గం ఇన్‌చార్జి మహ్మద్ సలావుద్దీన్ లోధి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం ముస్లిం మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఒకప్పుడు కేవలం 12 ముస్లిం రెసిడెన్షియల్ పాఠశాలలు మాత్రమే ఉండగా నేడు వాటి సంఖ్య 260కి పెరిగిందన్నారు. ఆయా పాఠశాలల్లో 1,40,000 మంది ముస్లిం విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నట్లు తెలిపారు. పాతబస్తీలో ముర్గీచౌక్, మీరాలంమండీ, గుల్జార్‌హౌజ్ ఫౌంటెన్, సర్దార్ మహల్ భవనాల ఆధునీకరణ పనులు కొనసాగుతున్నాయన్నారు.